క్లుప్తంగా

మాజీ మంత్రి ప్రసన్న పరామర్శ



శ్రీనివాసులురెడ్డితో మాట్లాడుతున్న ప్రసన్న

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : దామరమడుగు గ్రామం ఆర్ఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన్ను మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, బాలశంకర్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

నార్తురాజుపాళెం యువకుడికి డాక్టరేట్



షేక్.ఆరిఫ్

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెనికి చెందిన షేక్ ఆరిఫ్‌కు పంజాబ్‌లోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగంలో పవర్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ చేసి పవర్ లాస్‌ను తగ్గించి హార్మోనిక్స్‌ను తగ్గించడం అనే విషయంలో పరిశోధన చేయడం ద్వారా పీహెచ్‌డీ డాక్టరేట్ లభించింది. పరిశోధనకు మార్గదర్శకుడిగా డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్, ఉప మార్గదర్శకుడిగా డాక్టర్ సచిన్ మిశ్రాలు వ్యవహరించారు. పరిశోధన అనంతరం వైవా పరీక్షను దన్బాద్ ఐఐటీ విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో నిర్వహించారు.

గాలీవాన బీభత్సం



పొదలకూరులో కురుస్తున్న వర్షం

పొదలకూరు : మండల చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆదివారం అకాల వర్షం బీభత్సం సృష్టించింది. నిమ్మ, మామిడి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. గాలి వీస్తుండడం వల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షం వల్ల ప్రజలు భీతిల్లారు. హోరున గాలి తోలడంతో వీధుల్లో చిన్నచిన్న చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. అయితే వేసవి తాపం, ఉక్కపోతతో బాధపడుతున్న జనాలకు ఊరట లభించింది.

తాళాలు పగలగొట్టి.. సామాన్లు బయటపడేసి

నెల్లూరు(క్రైమ్): షాపు షట్టర్ తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులో ఉన్న సామాన్లను బయటపడేసిన ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు ఆదివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. శెట్టిగుంటరోడ్డు బట్టీలవారివీధికి చెందిన విజయ్.. మద్రాస్ బస్టాండ్ సమీపంలోని రాజీవ్ కాంప్లెక్స్‌లో ఓ గదిని అద్దెకు తీసుకొని టీ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో షాపునకు తాళాలేసి విజయ్, ఆయన భార్య ఇంటికి శనివారం వెళ్లారు. ఆదివారం వచ్చి చూడగా, షాపులోని సామాన్లను గుర్తుతెలియని వ్యక్తులు బయటపడేసి అక్కడ కుర్చీలు వేసుకొని కూర్చొని ఉన్నారు. వారిని ప్రశ్నించగా, అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు. కాగా ఘటన వెనుక అసోసియేషన్ నేత చిరంజీవి హస్తం ఉండొచ్చని, గతంలోనూ ఆయన షాపును బలవంతంగా ఖాళీ చేయించేందుకు యత్నించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహిరంగ మద్యసేవనంపై కన్నెర్ర

నెల్లూరు సిటీ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న 25 మందిపై కేసును నెల్లూరు రూరల్ పోలీసులు నమోదు చేశారు. జాతీయ రహదారికి సమీపంలోని పద్మావతి గ్రీన్‌సిటీ, మరో లేఅవుట్లో చెట్ల కింద కూర్చొని బహిరంగంగా మద్యాన్ని కొందరు ఆదివారం సేవించసాగారు. దీంతో రూరల్ సీఐ వేణు ఆధ్వర్యంలో ఎస్సైలు లక్ష్మణరావు, ప్రసాద్‌రెడ్డి దాడులు జరిపి, కేసులు నమోదు చేశారు.

ఘనంగా రాగాల పల్లకి

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని ఏసీ హాల్లో రాగాల పల్లకి కార్యక్రమాన్ని పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయుర్వేద వైద్యుడు బొనిగి ఆనందయ్య హాజరయ్యారు. అనంతరం నటి శ్వేత, కళాకారులను సత్కరించారు. రవి కుమార్, కృష్ణవేణి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మురుగు ఇలా.. నడిచేదెలా



మండల కార్యాలయాలకు ఎదురుగా సీసీరోడ్డుపై మురుగునీటి ప్రవాహం

తోటపల్లిగూడూరు : డ్రైనేజీ కాలువలు అస్తవ్యస్తంగా మారడంతో పలు గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీలో ప్రధాన రహదారి పక్కనే సీసీరోడ్డుపై వారం రోజులుగా మురుగునీరు తిష్ట వేసింది. ఎస్సీ కాలనీలోని మురుగునీరు ప్రధాన కాలువకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన వాల్వు మూసుకుపోవడంతో రోడ్డుపైనే మురుగు పొంగి ప్రవహిస్తోంది. దీంతో కాలనీవాసులు ప్రధాన రహదారికి చేరుకోవాలంటే అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది. మండల కార్యాలయాలకు ఎదురుగానే ఈ రోడ్డు ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

సండే సందడి



కోడూరు తీరంలో సందడి చేస్తున్న పర్యాటకులు

తోటపల్లిగూడూరు : ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఉపశమనం కోసం చల్లని ప్రదేశాలకు పరుగులు తీస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కోడూరు బీచ్‌కు సందర్శకులు పోటెత్తుతున్నారు. జిల్లా నలువైపుల నుంచి ఆదివారం అధిక సంఖ్యలో ప్రజలు కోడూరు సాగరతీరంలో సందడి చేశారు. పిల్లలు, యువత సముద్ర స్నానాలతో ఆనందంగా గడిపి, ప్రశాంతంగా సేదతీరారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 4 వరకు కొనసాగింది.

నిత్యం.. ట్రాఫిక్‌మయం



పట్టణంలో స్తంభించిన ట్రాఫిక్

పొదలకూరు : పట్టణ పరిధిలో తరచూ భారీగా ట్రాఫిక్ స్తంభిస్తోంది. చుట్టుపక్కల ఐదు మండలాలకు పొదలకూరు కేంద్ర బిందువు కావడంతో ఇటీవల ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీనికితోడు ఆత్మకూరు, మర్రిపాడు, ఏఎస్‌పేట తదితర ప్రాంతాల నుంచి ఇదే మార్గంలో తిరుపతికి వాహనాలు వెళ్తుండడం వల్ల వాహనాల తాకిడి అధికమైంది. దీంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అంతేకాక తరచుగా రోడ్డు ప్రమాదాలు సైతం సంభవిస్తున్నాయి. ప్రధానంగా సిండికేట్ బ్యాంక్, పంచాయతీ బస్టాండ్, సినిమాహాల్ ప్రాంతాల్లో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పోలీస్ అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిందిగా పట్టణ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చిన్న కాలువలపై చూపు

- పూడికతో నిండి ఉన్న బ్రాంచ్ కాలువలు
- చుక్క నీరందడం కష్టమే
- పూడికతీత ఊసెత్తని అధికారులు
- కాలువలను గాలికొదిలి నీటి విడుదలకు ఏర్పాట్లు

ఇరిగేషన్ అధికారులు చిన్న కాలువల విషయంలో చిన్నచూపు చూస్తున్నారు. నిత్యం ప్రధాన సాగునీటి కాలువలకే ప్రాధాన్యమిస్తున్నారు. వాస్తవానికి ప్రధాన కాలువల నుంచి చిన్న కాలువల ద్వారానే ఆయకట్టుకు సాగు నీరందాలి. కానీ ఇవేమీ పట్టనట్లు కేవలం ప్రధాన సాగునీటి కాలువలపై మాత్రమే దృష్టి పెడుతున్నారు. బ్రాంచ్ కాలువల పూడికతీత జోలికెళ్లడం లేదు. దీంతో వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందక రైతులు అల్లాడిపోతున్నారు. రెండో పంటకు సోమవారం నుంచి నీరు విడుదల చేస్తామంటున్న నేపథ్యంలో కాలువల పరిస్థితేమిటని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.



పూడికతో నిండి ఉన్న 430 ఎకరాల ఆయకట్టున్న కొడవలూరు సాగునీటి కాలువ

కొడవలూరు: మండలంలోని తూర్పు కాలువ ప్రధాన సాగునీటి కాలువగా ఉంది. కనిగిరి రిజర్వాయర్ నుంచి ఈ కాలువ ద్వారా కొడవలూరు, విడవలూరు మండలాల్లో 40 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందాల్సి ఉంది. ఒక్క కొడవలూరు మండలంలోనే 20 వేల ఎకరాలకు సాగు నీరందాలి. అయితే ఈ ఆయకట్టుకు నేరుగా ప్రధాన కాలువ నుంచి కాక చిన్న కాలువల ద్వారా సాగు నీరందిస్తారు. కొడవలూరు మండలంలో ప్రధానమైన తూర్పు కాలువ నుంచి తలమంచి, దామేగుంట కాలువలు ఎక్కువ ఆయకట్టు కలిగి ఉన్నాయి. తలమంచి కాలువ 5 వేల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగు నీరందిస్తుండగా, దామేగుంట కాలువ రెండు వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగు నీరందిస్తుంది. ఈ కాలువలు కూడా నేరుగా కాకుండా చిన్న కాలువల ద్వారానే ఆయకట్టుకు నీళ్లందిస్తాయి.



ఆనవాళ్లు కోల్పోయిన గుండాలమ్మపాళెం కాలువ

తలమించి కాలువ అంతంతే..

తలమంచి కాలువ కింద ఐదు వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంటుంది. ఈ కాలువను తొలి పంట సమయంలో పూడిక తీసినప్పటికీ మరలా పూడికతో నిండి ఉంది. దీని కింద కాంగ్రెస్ కాలువ, ఈర్లమిట్ట తూము కాలువ, సీ కాలువ, వరదారెడ్డి తూము కాలువలు ఉన్నాయి. దీని పరిధిలో వెయ్యి ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి పరిస్థితి ప్రస్తుతం అత్యంత దయనీయంగా ఉంది. కాలువల ఆనవాళ్లు కోల్పోయి చుక్క నీరు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. తూర్పు కాలువ నుంచి చీలి మండల కేంద్రమైన కొడవలూరు పరిధిలోని 430 ఎకరాల ఆయకట్టుకు నీరందించే కొడవలూరు కాలువ పూడికతో నిండి పచ్చిక బయళ్లను తలపిస్తోంది. దీనివైపు కన్నెత్తి చూసిన వారు లేరు. తలమంచి, దామేగుంట చివరి ఆయకట్టు కావడంతో రైతులే సొంతంగా పూడిక తీసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని ఆవేదన చెందుతున్నారు. దామేగుంట, తలమంచి, కొడవలూరు, గుండాలమ్మపాళెం, వెంకన్నపురం, బసవాయపాళెం తదితర గ్రామాల రైతులు చిన్న కాలువల పూడిక తీయాలని, లేదంటే రైతులు సాగు నీరందక నష్టపోవాల్సి ఉంటుందని ఇరిగేషన్ అధికారులను కోరారు. అయితే దీనికి ప్రభుత్వపరంగా ఎలాంటి నిధుల వెసులుబాటు లేదని, కేవలం పెద్ద కాలువల్లో మాత్రమే పూడికతీత ఉంటుందని అధికారులు చెప్పినట్లు రైతులు వాపోతున్నారు.

మేమే స్వయంగా తీసుకోవాలి



చిన్న కాలువలు పూడిక తీయకపోవడం వల్ల మాకు సాగు నీరందడం కష్టం. పంట విరామమివ్వాల్సి వస్తోంది. పంటపైనే ఆధారపడిన మేము విరామమిస్తే కష్టం. అందువల్ల మొదటి పంట సమయంలో వలే రైతులంతా కలిసి కాలువలు పూడిక తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇరిగేషన్ అధికారులను చిన్న కాలువల విషయమై అనేక పర్యాయాలు మొరపెట్టుకుని ప్రయోజనం లేనందువల్లే సొంతంగా తీసుకోవడానికి సిద్ధమవ్వాల్సి వస్తోంది. అయినప్పటికీ పై భాగాన కాలువల పరిస్థితి బాగాలేనందున సమృద్ధిగా సాగు నీరందడం కష్టతరమే.

– కలిశెట్టి వెంకయ్య, రైతు, తలమంచి

దామేగుంట కాలువ దుర్భరం

దామేగుంట కాలువ కింద రెండు వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉన్నప్పటికీ పూడికతీత చేపట్టలేదు. ఈ కాలువ తూటాకు, పచ్చికతో నిండి ఆనవాళ్లు కోల్పోయి చుక్కనీరు ముందుకు సాగే పరిస్థితి కనిపించడం లేదు. ఈ కాలువనే నమ్ముకున్న దామేగుంట, వెంకన్నపురం, బసవాయపాళెం, గుండాలమ్మపాళెం, పద్మనాభసత్రం రైతులకు నీటి విడుదల జరిగినా ఎలాంటి ప్రయోజనం ఉండదు.



పూడికకు నోచుకోని దామేగుంట కాలువ

అధికారులకే చిత్తశుద్ధి లేదు



దామేగుంట కాలువ కింద మా గ్రామంలో 630 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ కాలువ పూడిక తీయకపోవడం వల్ల చుక్క నీరందే పరిస్థితి కనిపించడం లేదు. నీటి విడుదల ఉన్నప్పటికీ మాకు ఒనకూరేదేమీ ఉండదు. బోర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. రైతుల సమస్యల పట్ల ఇరిగేషన్ అధికారులకే చిత్తశుద్ధి లేకుండాపోయింది. కాలువలు పూడిక తీయాలని ఎన్ని పర్యాయాలు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. చిన్న కాలువల పూడికతీత జరగదని తేల్చి చెబుతున్నారు. సమస్యను దాట వేస్తున్నారే తప్ప రైతుల గోడు అధికారులకు పట్టడం లేదు.

– కొట్టే మల్లికార్జున, రైతు, దామేగుంట



దుస్థితిలో తలమంచి కాలువ

శిథిల రామమందిరం తొలగింపు



మందిరాన్ని తొలగిస్తున్న జేసీబీ

పొదలకూరు : శిథిలావస్థకు చేరుకున్న పట్టణంలోని రామమందిరాన్ని ఆదివారం ఉభయకర్తలు, భక్తులు కలిసి తొలగించారు. ఇదే స్థలంలో రామాలయాన్ని నిర్మించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మందిరం తొలగించే ముందుగా శనివారం ఉత్సవ విగ్రహాలు, పటాలను సమీపంలోని బాలాలయంలో చేర్చారు. ఆలయ నిర్మాణానికి స్థలం తక్కువగా ఉన్నా అందులోనే ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా నిర్మించడం జరుగుతుందన్నారు.

ఊటుకూరు పెద్దపాళెంలో వైద్య శిబిరం



వైద్య శిబిరంలో సిబ్బంది, గ్రామస్తులు

విడవలూరు: మండలంలోని ఊటుకూరు పెద్దపాళెం గ్రామంలో నెల్లూరు రిచ్ హాస్పిటల్, డాక్టర్ రవికుమార్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ భాస్కర్ మాట్లాడుతూ ఈ శిబిరం ద్వారా మత్స్యకార గ్రామాల్లోని బాలింతలు, పిల్లలకు వైద్య సేవలను అందించినట్లు వివరించారు. మొత్తం 80 మందికి ఓపీల ద్వారా మందులను పంపిణీ చేశామన్నారు.

వేసవి తాపానికి చల్లచల్లగా..



వేసవి తాపానికి బురదనీటిలో సేదతీరుతున్న గేదెలు

పొదలకూరు : ఎండ వేడిమికి తాళలేక పొదలకూరు పట్టణానికి సమీపంలోని పాట్లేళ్ల వాగులో అరకొరగా నిలిచి ఉన్న నీటిలో గేదెలు సేదతీరుతున్నాయి. చుట్టుపక్కల ప్రాంతంలో ఎక్కడా నీటినిల్వలు లేకపోవడంతో పశువులు ఎండ వేడిమికి తాళలేక కాలువ నీటిలో తాపాన్ని తగ్గించుకుంటున్నాయి. పశుసంపద అధికంగా ఉన్న కాలనీల్లో గేదెలన్నీ ఇక్కడే మేతకు వెళ్తాయి.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

పొదలకూరు : మండలంలోని ఆల్తుర్తి గ్రామానికి సమీపంలో నావూరుకు వెళ్లే మార్గంలో ఆదివారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏబీ స్విచ్‌లో ఏర్పడిన షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు రేగాయి. సమాచారం అందుకున్న పొదలకూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలను ఆర్పివేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న గడ్డి, చెట్లు తగులబడినట్టు సిబ్బంది తెలిపారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ, శ్యాప్ చైర్మన్

వెంకటాచలం : క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతమిస్తోందని శ్యాప్ చైర్మన్ రవినాయుడు అన్నారు. విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో జాతీయ స్థాయి పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఆదివారం మాట్లాడారు. చదువుతోపాటుగా క్రీడల్లోనూ రాణించేందుకు విద్యార్థులు ఆసక్తి చూపాలని సూచించారు. అనంతరం వీసీ అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను విజయవంతంగా పూర్తి చేయించామని, పురుషుల సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌ను కూడా విజయవంతం చేసేందుకు అన్నిచర్యలు చేపట్టామన్నారు. ఈ పోటీలు విద్యార్థుల్లో ప్రామాణికత, నాయకత్వం, జట్టు సామర్థ్యం వంటి మౌలిక విలువలను పెంపొందిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో వీఎస్‌యూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జేవీవీ పురస్కారాల ప్రదానం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

పొదలకూరు : పది ఫలితాలకు సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక సాయిబాబా మందిరంలో పురస్కారాలను ఆదివారం అందజేశారు. 500 మార్కులకుపైన సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మెమెంటో, ఫైల్స్, మెడల్స్‌ను అందించారు. ముఖ్యఅతిథులుగా సర్వశిక్ష జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు, నెల్లూరు అర్బన్ ఎంఈఓ అబ్దుల్‌హమీద్, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి హాజరయ్యారు. మ్యాపిల్ రిడ్జ్ ప్రీ స్కూల్ కరెస్పాండెంట్ మురళీరెడ్డి, వెంకట సంతోష్‌కుమార్ దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా కార్యదర్శి కోవూరు వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ కల్యాణ్, గౌరవాధ్యక్షుడు దామోదరం, పెంచలస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంలో హెచ్చరిక బోర్డు



పొదలకూరు : పట్టణంలోని సత్యనారాయణ లేఅవుట్‌లో వివాదాస్పదంగా ఉన్న 286 అంకణాల స్థలంలో పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డును ఆదివారం ఏర్పాటు చేశారు. సచివాలయం బిట్–3 సెక్రటరీ వంశీ వెళ్లి బోర్డు నాటించారు. స్థలం గ్రామ పంచాయతీకి చెందినదని, ఎవరైనా క్రయ, విక్రయాలు చేస్తే శిక్షార్హులు అవుతారని బోర్డును ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లేఅవుట్ స్థలం న్యాయస్థానం పరిధిలో ఉంది. గతంలో ఇక్కడ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డును శివశంకర్ అనే వ్యక్తి తొలగించారని రెండురోజుల క్రితం పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. త్వరలో న్యాయస్థానంలో స్థల వివాదంపై తీర్పు వెలువడనున్నట్టు తెలుస్తోంది.

గ్రంథాలయాల ఆవశ్యకతపై అవగాహన అవసరం



యల్లాయపాళెం గ్రంథాలయంలో..

కొడవలూరు : గ్రంథాలయాల ఆవశ్యకతపై తల్లిదండ్రుల్లో అవగాహన అవసరమని లైబ్రేరియన్ జె.సురేంద్రరెడ్డి తెలిపారు. వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని యల్లాయపాళెం గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులతో కేరమ్స్ ఆడించడంతో పాటు కథలు చెప్పించడం, పాటల పాడించడం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి రావడం వల్ల వివిధ రంగాల్లో నైపుణ్యం పెంపొందుతుందన్నారు. విద్యార్థులు వేసవి శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. మాజీ సర్పంచ్ బడుగు శ్రీనివాసులు విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారు.